## క్లుప్తంగా

### కులగణన సర్వే ప్రారంభం



గంగాడలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది, అధికారులు

బలిజిపేట: మండలంలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైంది. అందులో భాగంగా గ్రామాల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటా తిరిగి వారి వివరాలను కులగణన యాప్‌లో నమోదు చేస్తున్నారు. దీనిలో రెండు అంశాలకు సంబంధించి కుటుంబ వివరాలు ఉంటాయి. కుటుంబం కులం వివరాల ప్రకారం నింపిన వివరాలను అప్‌లోడ్ చేస్తారని ఈఓపీఆర్‌డీ రవికుమార్ తెలిపారు. మండలంలో 20,684కుటుంబాల వారు ఈ గణనను పక్కాగా చేయించుకోవాలని పిలుపునిచ్చారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి సర్వే నిర్వహించి కచ్చితమైన కులగణన అందించాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రబీపంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయాలి



చినభోగిలిలో ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలిస్తున్న ఏఓ ఎస్.అవినాష్

సీతానగరం: మండలంలోని రైతులు రబీపంటలు సాగు చేస్తున్న భూములను పరిశీలించి ఏఏ పంటలు సాగులో ఉన్నాయో చూసుకుని మొబైల్ ద్వారా వ్యవసాయ సహాయకులు ఈ క్రాప్ బుకింగ్ చేయాలని ఏఓ ఎస్.అవినాష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన చినభోగిలి, పెదభోగిలి, కాశీపేట గ్రామాల్లో రబీపంటలు సాగుచేస్తున్న భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలోని రైతులు 180 హెక్టార్లలో పెసర, 600 హెక్టార్లలో మినుము (అపరాలు)పంటలు, 150 హెక్టార్లలో మొక్కజొన్న, చెరకు 600 ఎకరాల్లో అపరాల పంటలు సాగు చేస్తున్నారని తెలియజేశారు. ఈ క్రాప్ చేసిన పంటలకు నష్టం వాటిల్లితే ఆయా పంటలకు బీమా వర్తిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు జగదీశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.


### ఓటర్ల జాబితాలో తప్పుల్లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఓటర్ల జాబితాలో తప్పుల్లేకుండా చూడాలని ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి తెలిపారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితాకు సంబంధించి పలు సూచనలు చేశారు. జాబితాల్లో తప్పులుంటే సరిదిద్దడంతో పాటు పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు.


### చినగీసాడలో జగనన్న ఆరోగ్య సురక్ష



వైద్యశిబిరంలో వైద్యారోగ్య సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని చినగీసాడ గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి రోగులు వచ్చి, ఆరోగ్య తనిఖీలు చేయించుకున్నారు. వైద్యారోగ్య సిబ్బంది కూడా అవసరమైన వారికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్.సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### మంచి మార్గం అనుసరించాలి



జైలు పరిసరాలను పరిశీలిస్తున్న సన్యాసినాయుడు, విజయ్‌రాజ్‌కుమార్

పాలకొండ: మనిషి జీవనానికి మంచి మార్గం అనుసరించాలని శ్రీకాకుళం జిల్లా లీగల్ సర్వీసెస్ సెక్రటరీ ఆర్. సన్యాసినాయుడు సూచించారు. శుక్రవారం స్థానిక సబ్‌జైల్‌ను జూనియర్ సివిల్ జడ్జి విజయరాజ్‌కుమార్‌తో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలు, వారిపై ఉన్న కేసులు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారంపై ఆరా తీశారు. సూపరింటిండెంట్ బి. జోగులుకు పలు సూచనలు అందించారు.

# సామాజిక సాధికారతకు దిక్సూచి ముఖ్యమంత్రి

పాచిపెంట: భారత రాజ్యాంగ రూపకర్త డా.బీఆర్ అంబేడ్కర్ కలలు గన్న సామాజిక సాధికారితకు దిక్సూచిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని పాచిపెంట ఎంపీపీ బడ్నాన ప్రమీల అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ నేపథ్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయవాడలో ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని జగన్‌మోహన్‌రెడ్డి చేయించారని, ఇది దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ఎత్తైన విగ్రహంగా నిలిచిపోతుందని అన్నారు. సుమారు 19 ఎకరాల్లో అంబేడ్కర్ స్మృతివనం, ఇందులో విజ్ఞానం, వినోదానికి సంబంధించిన అంశాలు ఏర్పాటైనట్లు వివరించారు. అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం వల్ల సామాజిక న్యాయం సాధ్యమైందని పేర్కొన్నారు. అందువల్ల తన వంటి ఎందరో గిరిజన, దళిత, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల ప్రజలు సమాజంలో ఉన్నత పదవులను అలంకరించగలుగుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొట్టాపు ముత్యాలునాయుడు, ఉపాధ్యక్షుడు పాచిపెంటవీరంనాయుడు, వైస్‌ఎంపీపీలు కొరిపల్లి రవీంద్రనాథ్, మీసాల నారాయణమ్మ, ఎంపీటీసీ దండి ఏడుకొండలరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



పాచిపెంట: అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎంపీపీ ప్రమీల, ప్రజాప్రతినిధులు, నాయకులు

**జగనన్న పాలనలోనే సామాజిక సాధికారత**

సాలూరు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో భారత రాజ్యాంగ నిర్మాత డా.బీఆర్ అంబేడ్కర్ కలలుగన్న సామాజిక సాధికారత సాకారమైందని వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్ అన్నారు. విజయవాడలో అంబేడ్కర్ భారీ విగ్రహావిష్కరణ నేపథ్యంలో శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో గల అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి పాల్గొన్నారు.



సాలూరు: అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న వైస్‌ఎంపీపీ రెడ్డి సురేష్, ఎంపీడీఓ పార్వతి తదితరులు



సీతానగరం: అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న సర్పంచ్ సీహెచ్ కృష్ణ జెడ్పీటీసీ బాబ్జీ

**అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం**

సీతానగరం: మండలంలోని లచ్చయ్యపేట ఎస్సీ కాలనీలో ఉన్న రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ సీహెచ్ కృష్ణ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీటీసీ ఎ.సింహాచలం శుక్రవారం క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయవాడలో భారత దేశప్రజలు గర్వపడేవిధంగా భారతరత్న బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా జాతికి అంకితం చేసిన శుభసందర్భంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తూ అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండలనాయకులు ఎం.కృపారావు, ఏలియ్య, ఎం.పకీరు, సీహెచ్ పెంట బాబు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో కోలాహలంగా జరిగిన సంక్రాంతి పండగ ముగియడంతో పారిశుద్ధ్య పనులు అన్నిగ్రామాల్లో జరుగుతున్నాయని ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం కాశీపేటలో సర్పంచ్ తేలు ధనుంజయమ్మ పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శి మురళి ఎస్సీకాలనీలోని కాలువల్లో పేరుకుపోయిన పూడికలను కూలీలతో తీయించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుద్ధ్య పనులను పరిశీలించిన ఈఓపీఆర్డీ కుమారవర్మ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్య పనులతో పాటు కాలువల్లో పూడికలు తీయించడం, మంచినీరు ట్యాంక్‌ను శుద్ధి చేయించడం జరుగుతున్నాయన్నారు. కాలువల్లో తీయించిన చెత్తను దూరప్రాంతానికి తరలించాలని కార్యదర్శులకు సూచించామని తెలిపారు.



కాశీపేట ఎస్సీకాలనీల్లో పూడిక తీతను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

ఇప్పటికే లచ్చయ్యపేట, చినభోగిలి, గెడ్డలుప్పి, బగ్గందొరవలస, పణుకుపేట, గుచ్చిమి, సూరంపేట గ్రామాల్లో సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఆయాగ్రామాల పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు చేయించారని తెలిపారు.

# పరిసరాల శుభ్రతతోనే..వ్యాధులు మాయం



మాట్లాడుతున్న సీహెచ్‌ఓ ఎస్వీ రమణ

- సీహెచ్ఓ ఎస్వీ రమణ

సీతానగరం: మండలంలోని గ్రామాల్లో దోమల నివారణ, పారిశుద్ధ్య పనులు నిర్వహించడానికి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని ప్రజలకుఅవగాహన కల్పిస్తున్నామని స్థానిక సీహెచ్‌సీ కమ్యూనిటీ (సీహెచ్ఓ) హెల్త్ ఆఫీసర్ ఎస్వీ రమణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం అంటిపేట సచివాలయం పరిధిలో ఉన్న గ్రామాల్లో సర్పంచ్ జి.తిరుపతి రావు, కార్యదర్శి శశిభూషణరావు డ్రైడే-ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీహెచ్ఓ మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులు మటుమాయం అవడం తథ్యమన్నారు. మహిళలు ఇళ్లలోని చెత్తను రోడ్లమీద వేయకుండా దూరప్రాంతాల్లో వేయాలని హితవు పలికారు. ఇళ్లలోని చెత్తను రోడ్లపై వేయడం వల్ల దోమలు వృద్ధి చెందే ఆస్కారం ఉందన్నారు. అలాగే కొబ్బరిబురికెలు, వాహనాలనుంచి తీసేసిన టైర్లు వీధుల్లో వేయడం వల్ల వాటిలో దోమలు ఆవాసం ఏర్పాటు చేసుకుంటాయని, దోమలు కుట్టడం వల్ల ప్రజలు వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. వ్యాధుల నివారణకు ముందుగా దోమలను నివారించాలని సూచించారు. ఖాళీ కొబ్బరి బురికెలు, తీసేసిన టైర్లకు మంటపెట్టి కాల్చివేయాలన్నారు. అలాగే కాలువల్లో చెత్త పేరుకుపోవడం వల్ల దుర్గంధం విరజిమ్ముతుందని తద్వారా ప్రజలు వ్యాధులకు గురయ్యే పరిస్థితి ఉందన్నా రు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కాలువల్లో పూడికలు తీయించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి మహిళలు జాగ్రత్తలు పాటించాలని కో రారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శర్మ, ఏఎన్ఎం గౌరీశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ స్వర్ణ, చిన్నారాయణ, ఆశ కార్యకర్త గౌరీపార్వతి. వలంటీర్లు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ పథకాలను తెలుసుకోవాలి

బలిజిపేట: భారత్ వికసిత్ సంకల్ప్ యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు తెలుసుకోవాలని మండలంలోని బర్లి సర్పంచ్ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు గ్రామంలో శుక్రవారం అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు ఉచిత గ్యాస్ కనెక్షన్లు, రైతులకు సబ్సిడీ యంత్రాలు, గృహాల మంజూరు, తదితరాలు అందుతున్నాయని వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులకు కొత్తగా సబ్సిడీపై పురుగు మందు పిచికారీ చేసేందుకు డ్రోన్‌లు అందిస్తున్నారన్నారు. వాటి గురించి సంబంధిత శాఖ అధికారులను అడిగి తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీలక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



బర్లి సచివాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది, ప్రజలు

### కాలుష్యనివారణకు అందరూ సహకరించాలి



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటిస్తున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: మండలంలోని ప్రజలు ప్రతి ఒక్కరూ ఒకమొక్క నాటి సంరక్షించే బాధ్యత తీసుకోవాలని తహసీల్దార్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఆఫీసు పని మీద వచ్చిన వారికి నీడ, ఫలసాయం వచ్చే మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పెరుగుతున్న వాయు, ధ్వనికాలుష్యాన్ని నివారించడానికి అందరూ ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల్లో మొక్కలు నాటాలని కోరారు. ఇప్పటికే కార్యాలయం ప్రాంగణంలో బాదం, కాశీ గంగాభవాని కొబ్బరి మొక్కలు, పూలజాతి, ఆనందాన్ని, ఆహ్లాదకరమైన వాతావరణం కల్గించే మొక్కలను నాటినట్లు చెప్పారు. కొనుగోలు చేసినవి కొన్ని మొక్కలు కాగా, దాతలు సమకూర్చిన మొక్కలను మరికొన్నింటిని నాటినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, గెడ్డలుప్పి సర్పంచ్ అల్లు తిరుపతిరావు, విశ్రాంత వీఆర్వో ప్రభాకర్, స్థానిక వీఆర్వో కుమారస్వామి, సింహాచలం, ఏఓ ఎస్.అవినాష్ పాల్గొన్నారు.

### ఉజ్వల గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్

గుమ్మలక్ష్మీపురం: ఉజ్వల గ్యాస్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ వి.మహేంద్రకుమార్ కోరారు. శుక్రవారం స్థానిక జీసీఎం సొసైటీ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన అక్కడి సిబ్బంది, సేల్స్‌మేన్‌లతో మాట్లాడుతూ సీజన్‌ల వారీగా లభించే అటవీ ఫలసాయాల కొనుగోలు, వాటి నాణ్యత ప్రయోజనాల ను గిరిజన ప్రజలకు వివరించాలన్నారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న జీసీఎంఎస్ భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించి, పనులన్నీ చివరి దశలో ఉన్నందున మరో వారం రోజుల్లో పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఎల్ఎస్ స్టాక్ పాయింట్, పెట్రోల్ బంకుతో పా టు జీసీసీ ఇండేన్ గ్యాస్ గొడౌన్‌ను కూడా ఆయన తనిఖీ చేసి, అర్హులందరికీ ఉజ్వల గ్యాస్ పథకం అందేలా చూడాలని తెలిపారు.

# ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

సాలూరు: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాటించాలని డిపో మేనేజర్ భాస్కర రెడ్డి అన్నారు. ఈ మేరకు సాలూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నిర్వహించిన రోడ్డు భద్రతా వారోత్సవాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు సక్రమంగా పాటిస్తూ వాహనాలు నడపడం వల్ల చాలావరకు రోడ్డుప్రమాదాలను అరికట్టవచ్చ న్నారు. రోడ్డు ప్రమాదాల్లో పలువురు మరణించడం మరికొంతమంది తీవ్రగాయాలపాలవుతున్నారని ఫలితంగా వారితో పాటు వారిమీద ఆధారపడిన వ్యక్తులు, కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు పడతాయని పేర్కొన్నారు. డిపోలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ మెకానిక్స్, ఆర్టీసీ మెకానిక్ సిబ్బందికి అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిపో మేనేజర్ భాస్కరరెడ్డి

# ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష




జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందిస్తున్న రంగునాయుడు

మక్కువ: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజలకురక్ష అని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మావుడి రంగునాయుడు అన్నారు. స్థానిక సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన రంగునాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల వద్దకే వైద్యం అందించాలనే ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సిబ్బంది, రోగులకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ, వైద్యసిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించాలి

- జిల్లా మలేరియా అధికారి టి.జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమాలు పక్కాగా నిర్వహించి జిల్లాలో అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి డీఎంఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన స్థానిక 14వ వార్డులో వైద్యసిబ్బంది చేపట్టిన డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటి పరిసరాల్లో ఉన్న కుండీలు, వాడుకల్లో లేని వస్తువుల్లో ఉన్న నీటి నిల్వలను పరిశీలించి అందులో దోమలు, జననోత్పత్తి ఏవిధంగా జరుగుతుందో అక్కడ ప్రజలకు అవగాహన కల్పించారు. తదుపరి నీటి నిల్వలను పారబోయించారు. పారిశుద్ధ్యం నిర్వహణ చేపట్టాలని వార్డు సచివాలయం సెక్రటరీకి సూచించారు. వాడుకలో ఉన్న నీరు అయినప్పటికీ ఎక్కువ రోజులు నిల్వఉంటే అందులో దోమలు వృద్ధి చెందుతాయని, ఎప్పటికప్పుడు నీటిని ఉపయోగించాలని, అదేవిధంగా ఇళ్లల్లో ఉండే ఫ్రిడ్జి వెనుక భాగం బాక్సుల్లో నీరు చేరుతుందని, వాటిని పారబోయాలని ప్రజలకు సూచించారు. డ్రైడే కార్యక్రమాల ద్వారా దోమల వ్యాప్తిని అరికట్టవచ్చునని ప్రజల్లో అవగాహన పెంపొందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, సచివాలయం సెక్రటరీ, ఉదయశ్రీ, సూపర్‌వైజర్ పుష్ప, ఏఎన్ఎం సునీత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంఓ టి.జగన్‌మోహన్‌రావు

# ఆరోగ్య ప్రదాత జగన్



జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరంలో రోగికి కిట్ అందిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: వైద్యారోగ్య శాఖకు ఎన్నో నిధులు సమకూర్చి అందరికీ ఆరోగ్య ప్రదాతగా సీఎం జగన్మోహన్ రెడ్డి అండగా ఉన్నారని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ అన్నారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని తుమరాడలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి జెడ్పీటీసీ రవికుమార్ హాజరయ్యారు. శిబిరం వద్దకు వచ్చిన వైద్యాధికారులతో మాట్లాడి హాజరైన రోగులకు అవసరమైన సేవలు అందించాలని సూచించారు. వచ్చిన ప్రతి ఒక్కరినీ సంపూర్ణంగా పరీక్షించి మంచి వైద్యం అందించాలని కోరారు. ప్రతి కౌంటర్ వద్ద రోగులకు ఎటువంటి వైద్యసేవలు అందుతున్నాయి, ఏఏ రకాల మందులు అందిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యంగా ప్రజలు భావించి ఇటువంటి వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కె.శ్రీరామూర్తి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# సెమీఫైనల్స్‌కు చేరిన ఆడుదాం ఆంధ్రా క్రీడలు



వాలీబాల్ విన్నర్స్‌ను అభినందిస్తున్న జెడ్పీటీసీ బాబ్జీ

సీతానగరం: మండలంలోని సీతానగరం, బూర్జ ఉన్నత పాఠశాలల్లోను, జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయం ప్రాంగణాల్లో నిర్వహిస్తున్న మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడల పోటీలు శుక్రవారం సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. ఈ మేరకు జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విద్యాలయంలో జరిగిన వాలీబాల్ పోటీల్లో లచ్చయ్యపేట జట్టు విన్నర్‌గా నిలిచింది. ఈ సందర్భంగా విన్నర్‌గా నిలిచిన క్రీడాకారులను జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, సర్పంచ్ సీహెచ్ కృష్ణ, ఎంపీటీసీ సింహాచలం అభినందించారు. అలాగే బూర్జలో జరుగుతున్న సెమీఫైనల్స్ క్రికెట్ మ్యాచ్‌ను ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓ పీఆర్డీ కె.కుమావర్మ, ఎస్సై ఎం.రాజేష్, సర్పంచ్ జి.దాసు పరిశీలించారు.

**కొనసాగుతున్న మండలస్థాయి పోటీలు**

సాలూరు: ఆడుదాం ఆంధ్రా మండలస్థాయి పోటీలు కొనసాగుతున్నాయి. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం, మండలంలోని పీఆఎస్‌బొడ్డవలస గురుకుల పాఠశాల క్రీడామైదానాల్లో పట్టణం, మండలానికి సంబంధించి మండలస్థాయి పోటీలు జరిగాయి. విజేతలు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ జయరాం, ఎంపీడీఓ పార్వతిలు తెలిపారు. క్రికెట్ మినహా మిగిలిన పోటీలు ముగిశాయని, శనివారంతో క్రికెట్ పోటీలు ముగుస్తాయని తెలిపారు.



బూర్జ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న క్రికెట్ సెమీఫైనల్స్‌ను పరిశీలిస్తున్న మండల అధికారులు



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరాం

### మద్యం బాటిళ్ల పట్టివేత

పాలకొండ రూరల్: మండలంలోని చిన మంగళాపురం గ్రామానికి చెందిన ఉత్తరకవాటం సింహాచలం అనే వ్యక్తి నుంచి 35 మద్యం బాటిళ్లు శుక్రవారం సాయంత్రం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై హేమంత్‌కుమార్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.